




ప్రజా
# రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం

స్మార్ట్ ఎడిషన్
EVENING 6PM

సంపుటి (Volume): 1 + సంచిక (Issue): 147 + Published From: నంద్యాల (Nandyal) + పేజీలు 3 + https:www.prajarepublic.com + వెల - 1/- | గురువారం 02 జనవరి 2025

RNI No: APTEL/2023/87888 | Andhrapradesh, Telangana, Kurnool, Vijayawada, Vishakapatnam, Tirupati, Ananthapuram, Rajamahedravaram, Guntur, Nellore, Srikakulam, Thadepallegudem, Kadapa, Ongole


# మోదీని కలిసిన దిల్జిత్ దొసాంజ్.. రైతన్నల ఆగ్రహం

ప్రధాని మోదీ- పంజాబీ గాయకుడు దిల్జిత్ దొసాంజ్ సమావేశంపై రైతు నేతలు నిరసన వ్యక్తంచేశారు.

**జనవరి 2, (రిపబ్లిక్ న్యూస్): నూతన సంవత్సరాదిని పురస్కరించుకుని ప్రముఖ గాయకుడు, నటుడు దిల్జిత్ దొసాంజ్. ప్రధానమంత్రి నరేంద్రమోదీని మర్యాదపూర్వకంగా కలిసిన సంగతి తెలిసిందే. పంజాబ్ సరిహద్దుల్లో నిరసన తెలుపుతున్న రైతన్నలు ఈ భేటీపై అనుమానాలు వ్యక్తంచేశారు. సింగర్ నిబద్ధతను ప్రశ్నించారు. గతంలో రైతు ఉద్యమానికి మద్దతుగా దొసాంజ్ తన గళాన్ని వినిపించారు. దీనిని ఉద్దేశించి పంజాబ్-హరియాణా సరిహద్దులోని ఖనౌరీ శిబిరం వద్ద ప్రస్తుతం నిరసన తెలుపుతోన్న రైతు నేత ఒకరు మాట్లాడుతూ.. "దిల్జిత్ నిజంగా రైతుల గురించి ఆలోచిస్తుంటే.. దల్లేవాల్డీకి సంఘీభావంగా ఇక్కడకు వచ్చి ఉండేవారు.**



మా ఆందోళనలు వినేవారు. గతంలో ఆయన చేసిన ప్రకటనకే కట్టుబడి ఉండేవారు. దానికి బదులుగా ప్రధాని మోదీని కలవడం అనుమానాలకు తావిస్తోంది. మా డిమాండ్లు నెరవేరేవరకు ఈ పోరాటం కొనసాగుతుంది" అని స్పష్టం చేశారు. పంటల కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించడం వంటి డిమాండ్లతో నవంబరు 26 నుంచి మరో రైతు నాయకుడు జగ్జీత్ సింగ్ దల్లేవాల్ నిరవధిక నిరశన దీక్ష చేపట్టారు. ఖనౌరీ వద్ద వేలాదిమంది రైతులు ఆయనకు మద్దతు తెలుపుతున్నారు. 38 రోజులుగా ఈ దీక్ష కొనసాగుతోంది. కాగా.. దల్లేవాల్ ఆరోగ్యం రోజురోజుకీ క్షీణిస్తుండటంతో వైద్యసహాయం అందించాలని పంజాబ్ ప్రభుత్వానికి సుప్రీంకోర్టు ఇటీవల ఆదేశాలు జారీ చేసిన సంగతి తెలిసిందే. అయితే దల్లేవాల్కు వైద్యం అందించడానికి వెళ్తే రైతు సంఘాలు అడ్డుకుంటున్నాయని, కనీసం ఐవీ ఫ్లూయిడ్స్నైనా ఇచ్చేందుకు వీలుచిక్కడం లేదని పంజాబ్ ప్రభుత్వం నిస్సహాయత వ్యక్తం విషయం తెలిసిందే. ఈ అంశంపై కోర్టులో విచారణ జరుగుతోంది. ఈ సమయంలో మోదీ-దిల్జిత్ భేటీకి సంబంధించిన దృశ్యాలు వైరల్ అయ్యాయి. ఈ సందర్భంగా గాయకుడిపై ప్రధాని ప్రశంసలు కురిపించారు. అతడు ప్రజల హృదయాలు గెలిచాడని, దిల్జిత్ అనే పేరును సార్థకం చేసుకున్నాడని ప్రశంసించారు. మరోపక్క.. ప్రధాని నుంచి తాను ఎంతగానో స్ఫూర్తి పొందానని గాయకుడు కొనియాడాడు. "2025 గొప్పగా ప్రారంభమైంది. ప్రధానితో భేటీని ఎప్పటికీ మర్చిపోలేను" అని సామాజిక మాధ్యమాల్లో రాసుకొచ్చాడు.

# కొత్త ఏడాదిలో పథకాలపై మంత్రులతో సీఎం చంద్రబాబు చర్చ

రాష్ట్ర మంత్రివర్గ సమావేశం అనంతరం పాలనాంశాలపై మంత్రులతో సీఎం చంద్రబాబు కాసేపు ముచ్చటించారు.



అమరావతి, జనవరి 2, (రిపబ్లిక్ న్యూస్): రాష్ట్ర మంత్రివర్గ సమావేశం అనంతరం పాలనా అంశాలపై మంత్రులతో సీఎం చంద్రబాబు కాసేపు ముచ్చటించారు. కొత్త ఏడాదిలో అమలు చేయాల్సిన వివిధ పథకాలపై చర్చించారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి 'తల్లికి వందనం' అమలుతో పాటు రైతులు, మత్స్యకారులకు ఇచ్చే రూ.20వేల ఆర్థిక సాయంపైనా చర్చ జరిగింది. రైతులకు కేంద్రం ఇచ్చే ఆర్థిక సాయంతో పాటు రూ.20వేలు ఒకేసారి చెల్లించే అంశంపై చర్చించారు. వేట నిలిచిపోయిన సమయంలో మత్స్యకారులకు రూ.20వేలు చెల్లించే విషయంపైనా మంత్రులతో సీఎం చంద్రబాబు మాట్లాడారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లే బాధ్యత మంత్రులపై ఉందని చంద్రబాబు అన్నారు. ఈనెల 8న విశాఖలో ప్రధాని మోదీ పర్యటన, రోడ్ విజయవంతం చేసేందుకు మంత్రులతో క్యాబినెట్ సబ్ కమిటీ వేయాలని నిర్ణయించారు.

# ముగిసిన ఏపీ క్యాబినెట్ భేటీ.. పలు కీలక నిర్ణయాలకు ఆమోదం

రాష్ట్ర సచివాలయంలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన ఏపీ మంత్రివర్గ సమావేశం ముగిసింది.

**అమరావతి, జనవరి 2, (రిపబ్లిక్ న్యూస్): రాష్ట్ర సచివాలయంలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన ఏపీ మంత్రివర్గ సమావేశం ముగిసింది. ఈ భేటీలో పలు కీలక నిర్ణయాలకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది.**

అమరావతిలో రూ.2,733 కోట్లతో చేపట్టనున్న పనులతో పాటు సీఆర్డీఏ 44వ సమావేశంలో నిర్ణయం తీసుకున్న రెండు పనులకు ఆమోదముద్ర వేసింది. మున్సిపల్ చట్ట సవరణ ఆర్డినెన్స్కు అంగీకారం తెలిపింది. భవన నిర్మాణాలు, లేఅవుట్ల అనుమతుల జారీ అధికారంపై సమావేశంలో చర్చ జరిగింది. అనుమతులు జారీ చేసే అధికారం మున్సిపాలిటీలకు బదలాయించేలా చట్ట సవరణకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. పిఠాపురం ఏరియా డెవలప్మెంట్ అథారిటీలో కొత్తగా 19 పోస్టుల ఏర్పాటుకు మంత్రివర్గం ఆమోదముద్ర వేసింది. తిరుపతిలో ఈఎస్ఐ ఆస్పత్రిని 100 పడకలకు పెంచేందుకు, గుంటూరు జిల్లా ప్రత్తిపాడు మండలంలో 100 పడకల ఈఎస్ ఐ ఆస్పత్రి నిర్మాణానికి అంగీకారం తెలిపింది. ఎస్ఐపీబీ ఆమోదించిన రూ.1,82,162 కోట్ల పెట్టుబడులకు క్యాబినెట్ ఆమోదముద్ర వేసింది. రామాయపట్నంలో బీపీసీఎల్ రిఫైనరీ, కాకినాడలో గ్రీన్ అమ్మోనియా ప్లాంట్ ఏర్పాటుపై సమావేశంలో చర్చించారు. నంద్యాల, వైఎస్ఆర్, కర్నూలు జిల్లాల్లో పవన, సౌర విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు మంత్రివర్గం అంగీకరించినట్లు తెలుస్తోంది. చిత్తూరు జిల్లాలో హోంశాఖ ఐఆర్ బెటాలియన్ ఏర్పాటుకు కేటాయించనున్న స్థలంపై క్యాబినెట్లో చర్చ జరిగినట్లు సమాచారం.



# జనవరి 5 నుంచి రైతు భరోసా దరఖాస్తులు స్వీకరణ?

రైతు భరోసా పై మంత్రివర్గానికి చేయాల్సిన సిఫార్సులపై చర్చించేందుకు ఉపసంఘం గురువారం సమావేశమై పలు కీలక నిర్ణయాలు తీసుకుంది.



హైదరాబాద్, జనవరి 2, (రిపబ్లిక్ న్యూస్): రైతు భరోసాపై మంత్రివర్గానికి చేయాల్సిన సిఫార్సులపై చర్చించేందుకు మంత్రివర్గ ఉపసంఘం గురువారం సమావేశమై పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. సాగు చేసే రైతులందరికీ రైతు భరోసా ఇవ్వాలని నిర్ణయించింది. రైతు భరోసాకు ఐటీ చెల్లింపు, భూమి పరిమితి పెట్టవద్దని కమిటీ అభిప్రాయపడింది. రైతుల నుంచి దరఖాస్తులు తీసుకోవాలని సబ్ కమిటీ నిర్ణయించింది. అధికారుల సర్వే, శాటిలైట్ మ్యాపింగ్ ద్వారా సాగు భూములు గుర్తించనున్నారు. జనవరి 5 నుంచి 7 వరకు దరఖాస్తులు తీసుకునే అవకాశముంది. సంక్రాంతి తర్వాత రైతు భరోసాను చెల్లిస్తామన్న ప్రభుత్వం.. నాలుగో తేదీన జరిగే మంత్రివర్గ సమావేశంలో దీనిపై తుది నిర్ణయం తీసుకోనుంది. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చైర్మన్ , మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, శ్రీధర్ బాబులు సభ్యులుగా ఏర్పాటైన ఉపసంఘం ఇప్పటికే పలు దఫాలుగా సమావేశమై చర్చించింది.

# బోరుగడ్డ అనిల్కు హైకోర్టులో చుక్కెదురు

రౌడీషీటర్ బోరుగడ్డ అనిల్ బెయిల్ పిటిషన్ ను ఏపీ హైకోర్టు కొట్టివేసింది. నిందితుడు సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు పెట్టడమే పనిగా పెట్టుకున్నారా?

అమరావతి, జనవరి 2, (రిపబ్లిక్ న్యూస్): రౌడీషీటర్ బోరుగడ్డ అనిల్ బెయిల్ పిటిషన్ ను ఏపీ హైకోర్టు కొట్టివేసింది. నిందితుడు సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు పెట్టడమే పనిగా పెట్టుకున్నారా? అని వ్యాఖ్యానించింది. ఇలాంటి వారిని క్షమించడానికి వీల్లేదని తేల్చి చెప్పింది. పిటిషనర్కు పూర్వ నేర చరిత్ర ఉందని పోలీసులు కోర్టుకు తెలిపారు. అనుచిత పోస్టుల వ్యవహారంలో నమోదైన 2 కేసుల్లో ఇప్పటికే ఛార్జిషీట్ దాఖలైందని చెప్పారు. సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు పెట్టిన వ్యవహారంలో బోరుగడ్డ అనిల్పై అనంతపురం నాలుగో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో ఆయన బెయిల్ కోసం పిటిషన్ దాఖలు చేసుకోగా.. తాజాగా గురువారం హైకోర్టు కొట్టివేసింది. వైకాపా అధికారంలో ఉన్న ఐదేళ్ల కాలంలో బోరుగడ్డ అనిల్ అరాచకానికి హద్దే లేకుండా పోయింది. పోలీసులు సైతం అతనివైపు చూడాలంటేనే భయపడే పరిస్థితి కల్పించాడు. గుంటూరు నగరానికి చెందిన అనిల్.. కేంద్రమంత్రిగా పని చేసిన రాందాస్ అఠావలె అనుచరుడిగా చెప్పుకొంటూ రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడిగా చలామణి అయ్యాడు. జగన్ను అన్నా అని సంబోధిస్తూ తానూ పులివెందులకు చెందినవాడినేనంటూ వైకాపాతో అంటకాగాడు. జగన్కు తొత్తుగా వ్యవహరిస్తూ ప్రతిపక్షాలు, ప్రతిపక్షనేతలపై సభ్యసమాజం తలదించుకునేలా సామాజిక మాధ్యమాలు, టీవీ డిబేట్లలో ఇష్టానుసారం దూషణలు చేశాడు. వైకాపా ఐదేళ్ల పాలనలో జగన్కు వ్యతిరేకంగా ఎవరూ మాట్లాడిన వారిపై అసభ్యకర పదజాలంతో విరుచుకుపడేవాడు. జగనన్ను వ్యతిరేకిస్తూ మాట్లాడితే చంపేస్తానంటూ బెదిరింపులకు దిగేవాడు. చంద్రబాబునాయుడు, పవన్కల్యాణ్, లోకేశ్ను ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేశాడు. ప్రతిపక్షాలకు చెందిన మహిళల గురించి అసభ్యకరంగా మాట్లాడి దూషించేవాడు. అప్పట్లో జగన్ పేరు చెప్పి గుంటూరు నగరంలో దందాలు, దౌర్జన్యాలతో హల్చల్ చేశాడు. నాడు అధికార పార్టీ వైకాపా అండదండలు ఉండటంతో ఇష్టారాజ్యంగా చెలరేగిపోయాడు. జగన్ పేరు చెబుతుండటంతో పోలీసుల అతని వైపు కన్నెత్తి చూడలేదు.



# కోటి మంది తెదేపా కార్యకర్తలకు బీమా.. ఎంవోయూ కుదిర్చిన నారా లోకేశ్

కోటి మంది తెదేపా కార్యకర్తల బీమాకు మంత్రి, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నారు.




మంగళగిరి, జనవరి 2, (రిపబ్లిక్ న్యూస్): కోటి మంది తెదేపా కార్యకర్తల బీమాకు మంత్రి, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈమేరకు యునైటెడ్ ఇండియా కంపెనీతో పార్టీ తరపున ఎంవోయూ చేశారు. జనవరి 1 నుంచే ఇన్సూరెన్స్ కవర్ అయ్యేలా అగ్రిమెంట్ను రూపొందించారు. ఉండవల్లిలోని నివాసంలో అవగాహన ఒప్పందంపై సంతకాలు చేశారు. ఇందులో భాగంగా కార్యకర్తలకు ప్రమాద బీమా వర్తించనుంది. కోటి మంది కార్యకర్తల కోసం ఒకేసారి ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించడం రాజకీయ పార్టీల చరిత్రలో ఇదే ప్రథమం. ఒప్పందం ప్రకారం జనవరి 1, 2025 నుంచి డిసెంబర్ 31, 2025 వరకు కోటి మంది కార్యకర్తల బీమా కోసం తొలివిడతలో రూ.42 కోట్లు పార్టీ చెల్లించింది. ఈ ఒప్పందం ప్రకారం కార్యకర్తలకు రూ.5 లక్షల ప్రమాద బీమా లభిస్తుంది. కార్యకర్తల సంక్షేమనిధి సారథిగా నారా లోకేశ్ బాధ్యతలు చేపట్టాక కేడర్ సంక్షేమమే లక్ష్యంగా విప్లవాత్మక నిర్ణయాలు తీసుకున్నారు. కార్యకర్తల సంక్షేమానికి ఇప్పటి వరకు రూ.138 కోట్లు ఖర్చు చేశారు. గత అరాచక ప్రభుత్వంలో కేసుల్లో ఇరుక్కున్న కేడర్ కోసం న్యాయ విభాగాన్ని ఏర్పాటు చేశారు. వివిధ ప్రమాదాల్లో దెబ్బతిన్న కార్యకర్తలను ఆదుకునేందుకు కేంద్ర కార్యాలయంలో ప్రత్యేక సెల్ను ఏర్పాటు చేశారు. మృతిచెందిన కార్యకర్తల పిల్లల కోసం హైదరాబాద్తో పాటు కృష్ణా జిల్లా చల్లపల్లిలో ఎన్టీఆర్ ట్రస్టు తరపున రెసిడెన్షియల్ స్కూళ్లు ఏర్పాటు చేసి ఉచితంగా విద్యనందిస్తున్నారు.

# అర్జున అవార్డుకు ఎంపికైన తెలుగు రాష్ట్రాల క్రీడాకారులు

జాతీయ క్రీడా పురస్కారాలను కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది.



హైదరాబాద్, జనవరి 2, (రిపబ్లిక్ న్యూస్): జాతీయ క్రీడా పురస్కారాలను కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. నలుగురికి భారత అత్యున్నత క్రీడా పురస్కారమైన మేజర్ ధ్యాన్చంద్ ఖేల్రత్న, 32 అర్జున అవార్డులు, 5 ద్రోణాచార్య అవార్డులను కేంద్రం ప్రకటించింది. అర్జున పురస్కారాలు దక్కించుకున్నవారిలో 17మంది పారా అథ్లెట్స్ ఉండటం విశేషం. అర్జున అవార్డులు అందుకున్న వారిలో తెలుగు రాష్ట్రాలకు చెందిన ఇద్దరు క్రీడాకారులు ఉన్నారు. విశాఖకు చెందిన రన్నర్ జ్యోతి యర్రాజీ, వరంగల్ జిల్లాకు చెందిన పారా అథ్లెట్ జీవాంజి దీప్తి ఎంపికయ్యారు.

printed and published by B.Nagendra on behaly of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: B.NAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmali.com

ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్పెషల్




రిపబ్లిక్ సినిమా CINEMA

# రాజమౌళి – మహేశ్ బాబు ప్రాజెక్ట్ ప్రారంభం..!

దర్శక ధీరుడు రాజమౌళి, హీరో మహేశ్ బాబుల కాంబినేషన్లో ఒక భారీ ప్రాజెక్ట్ తెరకెక్కనున్న విషయం తెలిసిందే. ఎస్ఎస్ఎంబి 29గా ఇది ప్రచారంలో ఉంది. తాజాగా ఈ సినిమా ప్రారంభమైనట్లు తెలుస్తోంది.






దర్శకధీరుడు రాజమౌళి, హీరో మహేశ్ బాబుల కాంబినేషన్లో ఒక భారీ ప్రాజెక్ట్ తెరకెక్కనున్న విషయం తెలిసిందే. ఎస్ఎస్ఎంబి 29గా ఇది ప్రచారంలో ఉంది. నేటినుంచి ఈ సినిమా అధికారికంగా ప్రారంభమైనట్లు తెలుస్తోంది. గురువారం ఈ సినిమా పూజా కార్యక్రమం హైదరాబాద్లో వేడుకగా జరిగినట్లు వార్తలు వస్తున్నాయి. నగర శివారులోని అల్యూమినియం ఫ్యాక్టరీలో ఈ వేడుక నిర్వహించారని సమాచారం. చిత్రబృందంతోపాటు మహేశాబాబు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారంటూ పలు వీడియోలు సోషల్మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. ఈ సినిమా లాంఛ్కు సంబంధించి టీమ్ నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన, ఫొటోలు వెలువడలేదు. మరోవైపు, ఈ సినిమా ప్రారంభంపై మహేశ్ అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వేసవి నుంచి ఈ సినిమా రెగ్యులర్ షూట్ మొదలు కానుందని సమాచారం. ఒకే మూవీగా తీసుకొస్తారా? లేక రెండు భాగాలుగా విడుదల చేస్తారా? అన్నది తెలియాల్సి ఉంది. భారీ బడ్జెట్తో రూపుదిద్దుకోనున్న ఈ సినిమాలో ప్రియాంక చోప్రా, పృథ్వీరాజ్ సుకుమారన్ నటించనున్నారని టాక్. హాలీవుడ్ నటీనటులు, టెక్నీషియన్స్ కూడా ఇందులో భాగం అయ్యారని వార్తలు వస్తున్నాయి. వీటిపై స్పష్టత రావాల్సి ఉంది. భారతీయ చిత్ర పరిశ్రమలో ఇప్పటివరకూ చూడని సరికొత్త ప్రపంచాన్ని రాజమౌళి ఈ చిత్రంతో ఆవిష్కరించనున్నారని రచయిత విజయేంద్రప్రసాద్ గతంలో ఓ ఇంటర్వ్యూలో తెలిపారు. దీంతో ఈ సినిమాపై అంచనాలు రెట్టింపు అయ్యాయి. అమెజాన్ అడవుల నేపథ్యంలో సాగే ఈ కథలో పలువురు విదేశీ నటులు కనిపించనున్నారు. భారతీయ భాషలతో పాటు, విదేశీ భాషల్లోనూ దీనిని అనువదించనున్నారు. దుర్గా ఆర్ట్స్ కె.ఎల్. నారాయణ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సరికొత్త లుక్లో మహేశ్ కనిపించనున్నారు. ఆ పాత్ర కోసం గత కొంతకాలంగా ఆయన సన్నద్ధమవుతోన్న విషయం తెలిసిందే. మరోవైపు రాజమౌళి లొకేషన్స్ కూడా సెర్చ్ చేసిన విషయం తెలిసిందే. ఇటీవల ఆయన ఒడిశా వెళ్లి వచ్చారు. కొంతకాలం క్రితం ఆఫ్రికాలోని అడవుల్లోనూ పర్యటించారాయన.

## 'గేమ్ ఛేంజర్' సెన్సార్ పూర్తి.. నిడివి ఎంతంటే!


'గేమ్ ఛేంజర్' సెన్సార్ పనులు పూర్తి చేసుకుంది. సెన్సార్ బోర్డు ఈ చిత్రానికి యూ/ఏ సర్టిఫికెట్ జారీ చేసింది.



రామ్ చరణ్ కథానాయకుడిగా శంకర్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'గేమ్ ఛేంజర్'. కియారా అద్వానీ కథానాయిక. భారీ బడ్జెట్తో నిర్మాత దిల్ రాజు ఈ మూవీని నిర్మించారు. సంక్రాంతి కానుకగా జనవరి 10న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకురానుంది. తాజాగా ఈ సినిమా సెన్సార్ పనులు పూర్తి చేసుకున్నట్లు చిత్రబృందం తెలిపింది. పొలిటికల్ థ్రిల్లర్గా రానున్న ఈ చిత్రానికి సెన్సార్ బోర్డ్ యూ/ఏ సర్టిఫికెట్ జారీ చేసింది. 165.30 నిమిషాల (2:45 గంటలు) రన్టైమ్ ఈ సినిమా అలరించడానికి సిద్ధమైంది. 'గేమ్ ఛేంజర్' ట్రైలర్ కోసం అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఇటీవల విదేశాల్లో ఈ సినిమా ప్రీ రిలీజ్ వేడుక అంగరంగ వైభవంగా జరిగింది. ఈ మూవీ ఎడిటర్ మాట్లాడుతూ.. దీని ట్రైలర్ ఎన్నో ప్రశ్నలకు సమాధానమిచ్చేలా ఉంటుందని తెలిపారు. లవ్, ఎమోషన్, యాక్షన్.. ఇలా అన్ని అంశాలు ఉంటాయన్నారు. జనవరి 2న ఈ ట్రైలర్ను రాజమౌళి విడుదల చేయనున్నారు. ఇప్పటికే ఈ సినిమాలోని మూడు పాటలు మంచి ప్రేక్షకాదరణను సొంతం చేసుకున్నాయి. రామ్చరణ్ ఇందులో ద్విపాత్రాభినయం చేస్తున్నారు. రామ్నందన్ అనే యువ ఐఏఎస్ అధికారిగా కనిపించడంతో పాటు, తండ్రి అప్పన్న పాత్రనూ ఆయనే చేశారు. అంజలి, సముద్రఖని, సునీల్, శ్రీకాంత్, నాజర్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్న ఈ మూవీకి తమన్ సంగీతం అందించారు. ఈ సినిమా క్లైమాక్స్లో రామ్ చరణ్ నటనకు జాతీయ అవార్డు వస్తుందని ప్రముఖ దర్శకుడు సుకుమార్ అభిప్రాయపడ్డారు. చిరంజీవితో కలిసి 'గేమ్ ఛేంజర్' చూసినట్లు సుకుమార్ తెలిపారు. ఫస్ట్ రివ్యూ ఇస్తున్నా అంటూ కొన్ని ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. 'ఫస్ట్ హాఫ్ అద్భుతంగా ఉంది. ఇంటర్వెల్ బ్లాక్ బస్టర్. సెకండాఫ్లో ఫ్లాష్ బ్యాక్ ఎపిసోడ్ చూస్తే ఒళ్లు జలదరిస్తుంది. శంకర్గారి సినిమాలు 'జెంటిల్మెన్', 'భారతీయుడు' చూసి ఎంత ఎంజాయ్ చేశానో అంతలా ఈ మూవీని కూడా ఆస్వాదించా' అని చెప్పారు.

## చరిత్రలో నేటి ప్రత్యేకత

- **1954:** భారతదేశ మొదటి రాష్ట్రపతి డా. బాబూ రాజేంద్ర ప్రసాద్ చేత భారతరత్న, పద్మ భూషణ్, పద్మ విభూషణ్ పురస్కారాలు ప్రారంభించబడినవి.
- **1958:** తెలుగు సినిమా నటుడు ఆహుతి ప్రసాద్ జననం (మ.2015).
- **1957:** తెలుగు సినీనటుడు ఎ.వి.యస్ జననం (మ.2013). (చిత్రంలో)
- **1959:** భారత మాజీ క్రికెట్ క్రీడాకారుడు కీర్తి ఆజాద్ జననం.
- **1960:** భారతదేశపు మాజీ క్రికెట్ ఆటగాడు రామణ్ లాంబా జననం (మ.1998).
- **2007:** తెలుగు సాహితీ విమర్శకుడు వల్లంపాటి వెంకటసుబ్బయ్య మరణించారు (జ.1937).



డా. బాబూ రాజేంద్ర ప్రసాద్



ఆహుతి ప్రసాద్



ఎ.వి.యస్



కీర్తి ఆజాద్



రామణ్ లాంబా



వెంకటసుబ్బయ్య

రిపబ్లిక్ స్పోర్ట్స్ SPORTS

## ఏం చేస్తారో ఏమో..

# స్పిన్నర్లపైనే దృష్టి..!


స్పిన్కు అత్యంత అనుకూలంగా ఉండే సిడ్నీ మైదానంలో భారత్కు రేపు అత్యంత కీలకమైన టెస్ట్ మొదలుకానుంది. ఇప్పటి వరకు జరిగిన మ్యాచ్లో మన స్పిన్నర్లు అంతంత మాత్రంగానే రాణించారు.




బోర్డర్–గావస్కర్ ట్రోఫీలో భారత్కు విషమ పరీక్షగా భావించే చివరి టెస్ట్ రేపటి నుంచి ప్రారంభం కానుంది. ఆడిన 13 మ్యాచ్లో ఒక్క విజయం (1978) మినహా ఐదు డ్రాలు.. ఏడు ఓటములే ఉన్నాయి. తాజాగా బీజీటీలో పరువు కాపాడుకోవాలంటే భారత్ ఈ మ్యాచ్ గెలిచి తీరాల్సిన పరిస్థితి నెలకొంది. స్పిన్నర్లకు అనుకూలంగా ఉండే మనవాళ్లు ఎలా రాణిస్తారో అన్న టెన్షన్ ఉంది. ఇప్పటికే జట్టులో ఉన్న స్పిన్నర్లు కూడా ఘోరంగా విఫలమయ్యారు. మొత్తం నాలుగు టెస్టుల్లో కలిపి కేవలం 7 వికెట్లు మాత్రమే సాధించారు. వీరిలో నాలుగో టెస్టో జడ్డూ తీసిన 78 పరుగులకు 3 వికెట్లే అత్యధికం. ఈ నేపథ్యంలో సిడ్నీ మైదానంలో ఏ రకంగా ఆడతారనేది ఇప్పుడు భారత్కు టెన్షన్గా మారింది. జడ్డూ, సుందర్పైనే ఇప్పుడు జట్టు ఆధారపడింది. ఈ పిచ్పై భారత్ తరపున కుంబ్లే 2003–04లో తీసిన 12 వికెట్లే అత్యధిక రికార్డు. నాటి మ్యాచ్ తొలి ఇన్నింగ్స్ లో 8/141, రెండో ఇన్నింగ్స్ లో 4/138 సాధించాడు. తాజాగా స్టార్ స్పిన్నర్ అశ్విన్ రిటైర్మెంట్తో భారత్ స్పిన్ దళానికి జడేజానే పెద్దదిక్కుగా మారాడు. 2019లో కుల్దీప్ యాదవ్ ఈ వికెట్పై ఐదు వికెట్లు సాధించాడు. కానీ, ఈ సారి సిరీస్లో అతడికి స్థానం దక్కలేదు. భారత్కు ఇక్కడ ఇన్నింగ్స్ ఓటమిని మూటగట్టుకొన్న రికార్డు కూడా ఉంది. 2011–12 మ్యాచ్లో భారత్ 191, 400 పరుగులు చేసింది. ఆసీస్ నాలుగు వికెట్లకు 659 పరుగులతో తొలి ఇన్నింగ్స్లోనే 463 పరుగుల ఆధిక్యాన్ని దక్కించుకొంది. ఈ మ్యాచ్ను భారత్ ఇన్నింగ్స్ 68 పరుగుల తేడాతో ఓడిపోయింది. ఈ మైదానంపై సచిన్కు ఎదురులేదు. మొత్తం ఐదు టెస్ట్ మ్యాచ్లు ఆడి.. 157 సగటున 785 పరుగులు సాధించాడు. వీటిల్లో మూడు శతకాలు, ఐదు అర్ధశతకాలు ఉన్నాయి. ఇక్కడ 241 పరుగులు మాస్టర్ బ్లాస్టర్ అత్యధిక స్కోర్. టెస్టుల్లో ఆరుగురు కెప్టెన్లు త్రిశతకాలు సాధించగా.. వాటిల్లో మూడు భారత్పైనే చేశారు. వీటిల్లో ఒకటి 2012 సీజన్లో ఆసీస్ కెప్టెన్ మైకెల్ క్లార్క్ సాధించాడు. నాడు భారత్పై అత్యధికంగా 329 పరుగులు చేశాడు. అదే మ్యాచ్లో క్లార్క్–మైక్ హస్సీ కలిసి 334 పరుగుల అభేద్య భాగస్వామ్యం నెలకొల్పారు. భారత్పై ఇదే త్రిశతక భాగస్వామ్యం.

## ఇంటి చిట్కాలు

# ఉల్లిరసంలో వీటిని కలిపి రాస్తే జుట్టు రాలడం తగ్గడమే కాదు.. ఒత్తుగా అందంగా పెరుగుతుంది



జుట్టు రాలడం చాలా మంది ఫేస్ చేసే ప్రాబ్లమ్. దీనిని తగ్గించుకునేందుకు కొన్ని ఇంటి చిట్కాలు బాగా హెల్ప్ చేస్తాయి. అందులో కొన్ని తెలుసుకోండి. జుట్టు రాలడానికి చాలా కారణాలే ఉండొచ్చు. రోజుకి కొంత జుట్టు ఊడిపోవడం కామన్. కానీ, ఎక్కువగా ఊడిపోతుంటే జాగ్రత్త పడాల్సిందే. దీనికి కారణాలు తెలుసుకోవాలి. అదే విధంగా, కొన్ని ఇంటి చిట్కాలు ఈ సమస్యని సాల్వ్ చేస్తాయి. అలాంటి వాటిలో ఉల్లిపాయ రసం కూడా ఒకటి. దీనిని సరిగ్గా వాడితే జుట్టు రాలడం తగ్గి ఒత్తుగా పెరుగుతుంది. మరి జుట్టు రాలడాన్ని తగ్గించి ఒత్తుగా పెరిగేందుకు ఉల్లిపాయ రసం ఎలా పనిచేస్తుందో తెలుసుకోండి.



### ఉల్లిపాయ రసంతో లాభాలు..



ఉల్లిపాయ రసంలో జుట్టు ఆరోగ్యాన్ని కాపాడే గుణాలు ఉన్నాయి. ఇది తలపై వచ్చే ఫంగల్ ఇన్ఫెక్షన్స్తో పోరాడుతుంది. బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్స్ని దూరం చేస్తుంది. దీంతో తల వెంట్రుకలు రాలకుండా కాపాడుతుంది. దీనిని రాయడం వల్ల కెరాటిన్ ఆరోగ్యంగా ఉంటుంది. జుట్టు చిట్లిపోవడానికి , బలహీనమవ్వడానికి కెరాటిన్ ముఖ్య కారణం. ఇది డై సల్ఫైడ్ అనే మూలకం ద్వారా ఆరోగ్యంగా ఉంటుంది. ఉల్లిపాయలు డై సల్ఫైడ్ని సరిచేస్తాయి. ఇది కెరాటిన్ పొరని ఆరోగ్యంగా ఉంచుతుంది. ఉల్లిపాయలోని సల్ఫర్ ఈ ప్రయోజనాన్ని అందిస్తాయి.

### ఉల్లిరసం ఎలా పనిచేస్తుంది?



ఉల్లిరసంలో సల్ఫర్ ఉంటుంది. ఇది కొల్లాజెన్ ప్రొడక్షన్, జుట్టుని పెంచుతుంది. ఇందులోని యాంటీ ఆక్సిడెంట్స్ జుట్టు తెల్లబడడాన్ని తగ్గించి జుట్టు రాలకుండా చూస్తుంది. రెగ్యులర్గా రాస్తే మంచి రిజల్ట్ ఉంటుంది.

### ఎలా వాడాలి..




దీనిని వాడడం కూడా తేలికే.. చిన్న ఉల్లిపాయ లేదా మీ జుట్టుకి సరిపోయే పరిమాణంలో ఉన్న ఉల్లిపాయని తీసుకోండి. దీనిని మెత్తగా గ్రైండ్ చేయాలి. ఇందులో నీరు పోసి మొత్తం పిండుకోవాలి. దీనిని తల మొత్తం అప్లై చేయాలి. కొందరికి ఉల్లిపాయ రసం రాస్తే దురద వస్తుంది. కాసేపు అలానే ఉండి తర్వాత క్లీన్ చేసుకోవాలి. దీనిని షాంపూతో క్లీన్ చేయాల్సిన అవసరం లేదు. నీటితోనే క్లీన్ చేయాలి. ఇది సహజమైన క్లెన్సింగ్ ఏజెంట్. ఇలా వారానికి రెండు, మూడు సార్లు చేయడం మంచిది.

### జుట్టు డ్రైగా ఉంటే..



మీ జుట్టు డ్రైగా ఉంటే ఉల్లిపాయ రసంలో దానికి సమాన పరిమాణంలో కొబ్బరి నూనె కలపండి. దీనిని తలకి రాసి అప్లై చేయాలి. ఆముదం రాసినా మంచిదే. రెగ్యులర్గా రాస్తే ఫంగల్ ఇన్ఫెక్షన్స్ వంటివి దూరమవుతాయి. దీనిని అప్లై చేసి 20 నిమిషాల పాటు అలానే ఉంచి క్లీన్ చేసుకోవాలి. ఇది స్కాల్ప్, జుట్టుకి కూడా రాయాలి. పిల్లలకి కూడా దీనిని వాడొచ్చు. అయితే, దీనిని రెగ్యులర్గా వాడితే జుట్టు రాలడం తగ్గి ఒత్తుగా పెరుగుతుంది.

### హెయిర్ మాస్క్..



ఉల్లిరసంతో మాస్క్ కూడా ప్రిపేర్ చేయొచ్చు. దీనికోసం ఉల్లిపాయ రసంలో కొద్దిగా అలోవెరా జెల్ వేసి బాగా కలపండి. ఇందులో మీకు నచ్చిన ఏదైనా ఆయిల్ వేసి కలపండి. తర్వాత జుట్టుకి దీనిని అప్లై చేసి అరగంట పాటు ఉండండి. తర్వాత నీటితో క్లీన్ చేసుకుంటే మంచి రిజల్ట్ ఉంటుంది.

### షాంపూ..



సాధారణంగా ఈ ఉల్లిరసంతో షాంపూ కూడా చేయొచ్చు. దీనికోసం ఉల్లిపాయ ముక్కల్ని, మందారపువ్వు రెక్కల్ని, అలొవెరా, కొన్ని మెంతుల్ని నీటిలో వేసి బాగా మరిగించండి. తర్వాత దీనిని బాగా వెంత్తగా చేసి జుట్టుకి అప్లై చేయండి.

### షాంపూ..



ఉల్లిపాయ రసాన్ని కొబ్బరి నూనె, నిమ్మరసంతో కలపండి. దీనిని జుట్టుకి అప్లై చేసి రాయండి. దీంతో ఇన్ఫెక్షన్, దురద తగ్గుతుంది. చుండ్రు కూడా దూరమవుతుంది. రెగ్యులర్గా రాస్తే మీకే రిజల్ట్ కనిపిస్తుంది. గమనిక:నిపుణులు, అధ్యయనాల ప్రకారం ఈ వివరాలను అందించాం. ఈ కథనం కేవలం మీ అవగాహన కోసమే. అందం, ఆరోగ్యానికి సంబంధించిన ఏ చిన్న సమస్య ఉన్నా వైద్యులను సంప్రదించడమే ఉత్తమ మార్గం. గమనించగలరు.